


‘బ్రేక్‌ఫాస్ట్, లంచ్ నిర్వహణ అక్షయపాత్రకు అప్పగించొద్దు’

రంగారెడ్డి అర్బన్, జూలై 29 : తెలంగాణ విద్యార్థులకు అక్షయపాత్ర ఇచ్చే విధానాన్ని సీఎం రేవంత్‌రెడ్డి వెనక్కి తీసుకోవాలని మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ అందించేందుకు అక్షయ పాత్ర సంస్థకు అప్పగించాలని ఆలోచన మానుకోవాలని తెలిపారు. అక్షయ పాత్రకు బ్రేక్ ఫాస్ట్, లంచ్ అప్పగిస్తే.. ఎన్నో ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజనం వండిపెడుతున్న కార్మికులు రోడ్డున పడే అవకాశముందని, వంట నిర్వాహకులకు అన్యాయం చేయొద్దని ఈ సందర్భంగా ఆమె కోరారు.



కమ్మెట-ఎన్కేపల్లి హెచ్‌పీ పెట్రోల్ బంక్

పని చేయని గాలి నింపే యంత్రం

వినియోగదారుల హక్కులు, చట్టాల గురించి ఉపన్యాసాలివ్వడమే గానీ.. జిల్లాలో వినియోగదారులకు అందుతున్న సేవల గురించి పట్టించుకునే నాథుడే లేడు. ప్రధానంగా పెట్రోల్ బంకుల్లో వాహనదారులకు సౌకర్యాలు కల్పిస్తామనే నిబంధనలతో అనుమతులు పొందిన యజమానులు.. ఆ తర్వాత అవేమీ పట్టించుకోవడం లేదు. కనీసం గాలి కొట్టేందుకు కూడా చాలా బంకుల్లో డబ్బులు తీసుకుంటున్నారు. కొన్ని బంకుల్లో ఎయిర్ కంప్రెషర్లు సైతం పని చేయవు. ఇలా అన్ని రకాలుగా వినియోగదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నా పౌరసరఫరాలు, తూనికలు కొలతలు తదితర శాఖల అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.



దేవుని ఎర్రవల్లి గేట్ సమీపంలోని నయార పెట్రోల్ బంక్

నిరుపయోగంగా గాలి నింపే యంత్రం

బంకుల్లో సౌకర్యాలేవీ?

నిబంధనలు గాలికొదిలిన నిర్వాహకులు

- దయనీయంగా పెట్రోల్ బంకుల నిర్వహణ
- నిరుపయోగంగా గాలి నింపే యంత్రాలు
- కనిపించని టాయ్‌లెట్లు, తాగునీటి సౌకర్యం
- వినియోగదారులకు కనీస వసతులు కరువు
- వ్యాపారమే పరమావధిగా బంకు యజమానుల తీరు
- పట్టించుకోని అధికారులు.. వాహనదారుల ఇబ్బందులు



(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, జూలై 29): జిల్లా వ్యాప్తంగా ఇండియన్, హెచ్‌పీ, రిలయన్స్, ఎస్సార్, భారత్, నయార తదితర కంపెనీలకు చెందిన 250కిపైగా పెట్రోల్ బంకులున్నాయి. వీటిలో కొన్ని జాతీయ రహదారి వెంట ఏర్పాటు చేయగా మిగతావి పట్టణాలు, మండల కేంద్రాల్లో ఉన్నాయి. అయితే వినియోగదారులకు సౌకర్యాలు కల్పించడంలో మాత్రం అన్ని బంకులదీ ఒకే తీరు అన్నట్టు ఉంది. ఎక్కడా నిబంధనల మేరకు వాహనదారులకు సౌకర్యాలు కల్పించడం లేదు. బంకుల్లో టైర్లలో గాలి కొట్టిద్దామన్నా అవకాశం ఉండటం లేదు. దాహమేస్తే నీరూ దొరకదు. మరుగుదొడ్ల ఏర్పాటే లేదు. పెట్రోల్, డీజిల్ కొలతలు సక్రమంగా ఉన్నాయా? అంటే అదీ అనుమానమే. ఎంతోమంది వాహనదారులు కొలతల్లో తేడాపై ఫిర్యాదులు చేస్తున్నా అధికారుల తనిఖీలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. చేవెళ్ల మండలంలో 5హెచ్‌పీ పెట్రోల్ బంకులు, 4 ఇండియన్, రెండు భారత్ పెట్రోలియం బంకులు, ఒక నయార పెట్రోల్ బంకు ఉన్నాయి. ఏ పంపు కూడా ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడవడం లేదు. ఎందులోనూ సౌకర్యా కల్పించలేదు. గాలి నింపు యంత్రాలున్నా అవి పనిచేయవు. శంకర్‌పల్లి మండలంలో 14పెట్రోల్ బంకులున్నాయి. మరుగుదొడ్లు, తాగునీరు, ఫస్ట్ ఎయిడ్ కిట్, ఫిర్యాదుల బాక్స్, రిజిష్టర్ వంటివి ఏ ఒక్కటీ బంకుల్లో కన్పించవు. మొయినాబాద్ మండలంలో నాలుగు పెట్రోల్ బంకులుండగా వాటిల్లో ఇండియన్ పెట్రోల్ బంకులో మరమ్మతులు జరుగుతున్నాయి. మిగితా బంకుల్లో ఎలాంటి సౌకర్యాలు లేవు. షాబాద్ మండలంలో 6 బంకులు ఉన్నాయి. ఒక్క బంకులో మాత్రమే ఎయిర్ కంప్రెషర్ ఉంది. యాచారం మండలంలో ఇటీవల ఓ పెట్రోల్ బంకులో పెట్రోల్‌కు బదులుగా నీరు రావడంతో వాహనదారులు డీఎస్‌వోకు ఫిర్యాదు చేశారు. యాచారం మండలంలో మూడు బంకులు, షాద్‌నగర్ టౌన్‌లోని పెట్రోల్ బంకుల్లో ఎలాంటి సౌకర్యాలు లేవు. జిల్లేడు చౌదరిగూడ మండలంలో రెండు పెట్రోల్ బంకులు, లాల్‌పహాడ్ వద్ద ఉన్న బంకుల్లో గాలి నింపే యంత్రాలతో పాటు తాగునీరు, మరుగుదొడ్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్స్, స్టాక్ బోర్డులు, రిజిష్టర్లు లేవు. ఇబ్రహీంపట్నం పరిధిలో పెట్రోల్ బంకుల్లో ప్రమాణాలు గాలికి వదిలేశారు. కొన్ని బంకుల్లో మాత్రమే గాలి నింపే యంత్రాలు పనిచేస్తున్నాయి. పౌర సరఫరాలు, తూనికలు కొలతల శాఖల అధికారుల తనిఖీలు నామమాత్రంగా చేస్తుండడంతో బంకు నిర్వాహకులు ఇష్టనుసారం వ్యవహరిస్తున్నారు. ఆమనగల్లులో ప్రాంతంలో 20 వరకు బంకులు ఉన్నాయి. ఎక్కడా కనీస ప్రమాణాలు పాటించడం లేదు. రెండు మూడు చోట్లే గాలికొట్టే మిషన్లు ఉన్నాయి. మరుగుదొడ్లు, మూత్రశాలలు, తాగునీటి వసతి, ఫస్ట్ ఎయిడ్ కిట్లు, ఫిర్యాదు బాక్స్‌లను ఏర్పాటు చేయలేదు. మహేశ్వరం మండలంలో 15 వరకు బంకులు ఉన్నాయి. ఏ బంకులోనూ సౌకర్యలు లేవు.

కొత్తూరులో ఆరు బంకులుండగా రెండు బంకుల్లో మాత్రమే గాలి పంపులు పనిచేస్తున్నాయి. కేశంపేటలో రెండు, తొమ్మిది రేకులలో ఒక బంకు ఉన్నాయి. వాటిల్లో మరుగుదొడ్ల సౌకర్యం ఉన్నా గాలి పంపులు పనిచేయడం లేదు. మాడ్గులలో రెండు పెట్రోల్ బంకులు ఉన్నాయి. కానీ.. వాటిల్లో ఎలాంటి సౌకర్యాలు లేవు. నిజానికి ప్రతీ బంక్‌లో వినియోగదారులకు టైర్లలో ఫ్రీ ఎయిర్, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు కల్పించాలి. ఇవి పొందడం వినియోగదారుల హక్కు. కానీ అవేవీ అమలు కావడం లేదు.

కనిపించని తూనికలు, కొలతల అధికారులు

జిల్లాలో ద్విచక్ర వాహనాలు, కార్లు, లారీలు, బస్సులు ఇతర వాహనాల సంఖ్య ఎక్కువే. పెట్రోలు, డీజిల్ వ్యాపారం విస్తృతంగా సాగుతోంది. పెట్రోలు, డీజిల్ సరఫరా కంపెనీలు డీలర్లకు ఆకర్షణీయ కమీషన్ ఇస్తూ బంకుల సంఖ్యను పెంచుతున్నాయి. కానీ బంకుల్లో నాణ్యత, సౌకర్యాలు ప్రశ్నార్థకమయ్యాయి. తనిఖీ చేయాల్సిన పౌరసరఫరాలు, తూనికలు-కొలతలు, రెవెన్యూ, విజిలెన్స్ శాఖల అధికారులు బంకుల వైపు కన్నెత్తి చూడడం లేదు. దీనిపై అనేక అనుమానాలున్నాయి. తనిఖీకి వెళ్లే ముందే బంకుల నిర్వాహకులకు సమాచారం అందుతోంది. దీంతో అక్రమాలు బయటపడకుండా అప్రమత్తమవుతున్నారు. తనిఖీల తర్వాత పరిస్థితి మళ్లీ మామూలేనని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

కనీస వసతులు కరువు

పెట్రోలు బంకుల్లో 10వేల లీటర్ల ఇంధనం విక్రయిస్తే వచ్చిన ఆదాయంలో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.600 వెచ్చించాలి. నెలకు రూ.18వేలు మరుగుదొడ్లకు, మంచినీరు, ఇతర సౌకర్యాలకు ఖర్చు చేయాలి. కానీ ఎక్కడా ఖర్చు చేయడం లేదు. టైర్లలో గాలి నింపాలని వాహనదారులు అడిగితే మిషన్ పనిచేయడం లేదని సిబ్బంది నిర్లక్ష్యంగా చెబుతున్నారు. గాలి నింపే యంత్రాలను తప్పక ఏర్పాటు చేయాలి. కానీ ఎక్కడా పనిచేయడం లేదు. పనిచేసినా టైర్లలో గాలి నింపాక డబ్బులు అడుగుతున్నారు. బంకు ప్రాంగణంలో వాహన చోదకులు కాలకృత్యాలు తీర్చుకోవడానికి మరుగుదొడ్లు ఉండాలి. కొన్ని చోట్ల ఉన్నా నీరు ఉంచరు. వాటికి తాళాలు వేస్తున్నారు. వినియోగంలో ఉన్నా అపరిశుభ్రంగా ఉంచుతూ వినియోగదారులు వాడకుండా చేస్తున్నారు. ప్రతీ బంకులో ఫిర్యాదు పెట్టె, రిజిష్టర్ పెట్టి ఏమైనా కంప్లైంట్లు ఉంటే వాహనదారులు రాసే అవకాశం కల్పించాలి. ఇవి ఎక్కడా లేవు. ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉంచాలి. పెట్రోలు నాణ్యతను పరీక్షించేందుకు వినియోగదారులకు ఫిల్టర్ పేపర్లు ఇవ్వాలి. బంకుల్లో ఫిల్టర్ పేపర్లు అడిగినా లేవంటారు. ఏమైనా చేసుకోండంటారు. బంకులో సంస్థ వివరాలు, యాజమాని పేరు, ఫోన్ నంబర్లతో ఏర్పాటు చేయాల్సిన బోర్డులు అక్కడక్కడ మాత్రమే కన్పిస్తున్నాయి.

కల్తీ పెట్రోల్ వచ్చింది



మూడు నెలల క్రితం చేవెళ్లలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో వంద రూపాయల పెట్రోల్ పోయించుకున్నా. వాటర్ బాటిల్‌లో కొట్టించుకున్నా. పెట్రోల్‌లో నీరు వచ్చింది. ఇదేమని ప్రశ్నిస్తే.. వాటర్ బాటిల్ రంగుతో అలా కన్పిస్తుందన్నారు. నేను కల్తీ పెట్రోల్‌పై మీడియాకు చెప్పడంతో నిర్వాహకులు పోలీసులతో కుమ్మక్కై నన్ను దబాయించే ప్రయత్నం చేశారు.

\- వి.శేఖర్, చేవెళ్ల

తనిఖీలు నామమాత్రంగా చేస్తున్నారు



నిబంధనలకు విరుద్ధంగా పెట్రోల్ బంకులను నడుపుతున్నారు. చేవెళ్ల డివిజన్ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో ఎక్కడా సౌకర్యాలు కల్పించలేదు. బంకుల్లో గాలి పంపులు ఉన్నా పనిచేయవు. మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. బంకుల్లో ఉన్న సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేస్తే తూతూ మంత్రంగా తనిఖీ చేస్తున్నారు. కలెక్టర్ అప్పుడప్పుడు ఆకస్మికంగా తనిఖీలు చేయాలి. నిబంధనలను పాటించని బంకులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

\- మాధవగౌడ్, కమ్మెట, చేవెళ్ల మండలం

ఘనంగా సీత్లా వేడుకలు

ఆడిపాడిన గిరిజన మహిళలు.. భక్తితో నైవేద్యం సమర్పణ

ఆమనగల్లు, జూలై 29 : ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి విఠాయిపల్లిలో సోమవారం సీత్లా వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ పండుగ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాన్ని చాటింది. మున్సిపల్ కౌన్సిలర్ సుజాతరాములు ఆధ్వర్యంలో వేడుకలకు ఏర్పాట్లు చేశారు. డీజే, బ్యాండ్ వాయిద్యాలతో ఊరేగింపుగా గ్రామ శివారులోని సీత్లా మాత ఆలయానికి చేరుకున్నారు. పూజల అనంతరం నైవేద్యం సమర్పించారు. తమ కుటుంబాలను చల్లగా చూడాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని సీత్లా మాతకు మొక్కుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాజు, బాలు, వాడ్య సురేశ్, రవీందర్, శ్రీను, గోపి, దశరథ్, మల్యా, తిరుపతి, గన్య రమేశ్, వెంకటేశ్, హర్య తదితరులు పాల్గొన్నారు.



పండుగలో నృత్యం చేస్తున్న గిరిజనులు



సీత్లా వేడుకలో పాల్గొన్న మహిళలు



రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న భారీ గుండు

గుండు పడుద్ది!

- మట్టి దిబ్బ కుంగి రోడ్డుపైకి దొర్లిన భారీ గుండు
- దారివెంట వెళ్లే వారికి ప్రమాదకరంగా మారిన వైనం

యాచారం, జూలై 29 : గత కొన్ని చెదురుమదురు వర్షాలకు మట్టి కుంగి భారీ గుండు రోడ్డుపైకి జారింది. రోడ్డువెంట వచ్చీపోయే వాహనదారులకు ప్రమాదకరంగా మారింది. గుండు జారిన సమయంలో బైక్‌పై వెళ్తున్న వారు త్రుటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు.. కొత్తపల్లి-కొత్తపల్లి తండా మట్టి రోడ్డు మరమ్మతు చేస్తున్నారు. రోడ్డు కోసం అధికారులు రోడ్డు పక్కనున్న దిబ్బ వద్ద మట్టి తోడి రోడ్డుపై పోయించారు. ఈ భారీ గుండు చుట్టూ మట్టి తీయడంతో వర్షాలకు మట్టి కుంగి గుండు రోడ్డుపైకి దొర్లింది. అదే సమయంలో బైక్‌పై వచ్చిన వారు గుండు దొర్లుకుంటూ రావడం చూసి ఆగిపోయారు. రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుండును వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు రెండో విడత రుణమాఫీ

- రూ.లక్షన్నర వరకు పంట రుణాల మాఫీ
- జిల్లాలో 22,915 మంది రైతులకు లబ్ధి

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : రైతులకు నేడు రెండో విడత రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. రెండో విడత జిల్లాలోని 22,915 మంది రైతులకు దాదాపు రూ.218కోట్ల వరకు రుణమాఫీ చేయనుంది. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ, బ్యాంకర్లు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. నేరుగా ఈ రుణమాఫీ సొమ్మును రైతుల ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేయనుంది. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ప్రభుత్వం దశలవారీగా రుణమాఫీ చేస్తున్న విషయం తెలిసిందే. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారంలోకి రాగానే రైతులకు రూ.2లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన సంగతి విదితమే. రైతు రుణమాఫీకి మార్గదర్శకాలు కూడా విడుదల చేసింది. పాస్‌బుక్‌లు ఉన్నవారందరికీ రుణమాఫీ చేస్తామని వెల్లడించింది. ఆగస్టు 15లోగా అర్హులైనవారందరికీ రుణమాఫీ చేసే పక్రియ పూర్తిచేస్తామని గతంలో ప్రకటించిన ప్రభుత్వం ఈ మేర అన్ని చర్యలు చేపట్టింది. ముందుగా ప్రకటించిన విధంగా ఈ నెల 18వ తేదీన తొలివిడత రూ.లక్షలోపు రైతు రుణాలను మాఫీ చేసింది. రుణమాఫీ కింద జిల్లాలో మొత్తం 49,741 మంది రైతులకు రూ.278.06కోట్లు మాఫీ చేయగా అత్యధికంగా షాద్‌నగర్, ఆమన్‌గల్ డివిజన్లలో రైతులకు లబ్ధి చేకూరింది. అత్యధికంగా షాద్‌నగర్ డివిజన్‌లో 13,467 మంది రైతులకు రూ.75.64కోట్ల రుణమాఫీ జరిగింది. అలాగే ఆమన్‌గల్ డివిజన్‌లో 12,486మంది రైతులకు రూ.75.30కోట్ల రుణ మాఫీ చేశారు. అతి తక్కువగా రాజేంద్రనగర్ డివిజన్‌లో 1,058 మంది రైతులకు రూ.5.04కోట్ల రుణమాఫీ చేశారు. రెండో విడత రుణమాఫీపై గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో విస్తృత ప్రచారం నిర్వహించాలని కాంగ్రెస్ నాయకత్వం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. దీంతో నేడు జిల్లా వ్యాప్తంగా సంబరాలు నిర్వహించుకునేందుకు పార్టీ శ్రేణులు సన్నద్ధమవుతున్నాయి.





మహిళా సంఘం సభ్యుల సమావేశం(ఫైల్)

ఎస్‌హెచ్‌జీ సభ్యులకు బీమా

- సంఘాల మహిళలందరికీ వర్తించేలా ప్రభుత్వ నిర్ణయం
- స్వయం సహాయక గ్రూపులకు సురక్షా బీమా అమలు
- ఇప్పటి దాకా రుణం తీసుకున్న వారికే అమలైన ఇన్సూరెన్స్
- చేవెళ్ల డివిజన్‌లో 51,460 మంది మహిళలకు వర్తింపు

చేవెళ్ల, జూలై 29: గ్రామీణ, పట్టణ ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆర్థిక చేయూతనిస్తూ వారిని అన్ని రంగాల్లో చైతన్యపర్చేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. ఇందులో భాగంగా చిరు వ్యాపారాలు, వాహనాల కొనుగోళ్లు, వ్యవసాయం, వైద్యం తదితర అవసరాలకు స్త్రీ నిధి రుణాలు పొందిన వారికి సురక్ష బీమాను వర్తింపజేస్తున్నారు. తీసుకున్న లోన్‌కు బీమా వర్తింపజేసేవారు. ఏ కారణం చేతనైనా రుణగ్రస్తురాలు మరణిస్తే లోన్ మొత్తం మాఫీ అయ్యేది. తద్వారా కుటుంబీకులపై ఆర్థిక భారం ఉండేది కాదు. అయితే రుణం తీసుకున్న వారికే బీమా వర్తింపజేసేవారు. అయితే ప్రస్తుతం లోన్‌తో సంబంధం లేకుండా సెల్ఫ్ హెల్ప్ గ్రూప్‌లోని సభ్యులందరికీ సురక్ష బీమా అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సభ్యులందరికీ సాధారణ, ప్రమాద మరణాలకు రుణ బీమా, ప్రమాద బీమా పథకాలకు సర్కార్‌శ్రీకారం చుట్టింది. సంఘ సభ్యులు ఎలా మరణించినా వారి కుటుంబాలకు బీమా పరిహారం అందతుంది.

60 ఏళ్ల లోపు సభ్యులందరికీ వర్తింపు ఇలా

స్వయం సహాయక సంఘ సభ్యులకు ప్రభుత్వం లోన్ బీమా, ప్రమాద బీమా పథకాలను అమల్లోకి తెచ్చింది. ఈ పథకాలకు 60 సంవత్సరాల్లోపు (14-03-2024 వరకు) ఎస్‌హెచ్‌జీల సభ్యులు అర్హులు. సభ్యురాలి వయస్సును ఆధార్ కార్డు/ఓటర్ ఐడీలపై ఉన్న దాని ప్రకారం ఏదో ఒకటి లెక్కిస్తారు. ఈ మేరకు ప్రభుత్వం బీమాకు సంబంధించిన నిబంధనల ఉత్వర్వులను జారీ చేసింది.

డివిజన్‌లో 51,460 మంది సభ్యులకు లబ్ధి

చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాల్లో 4,480 స్వయం సహాయక సంఘాలు, 193 గ్రామ సమాఖ్యలున్నాయి. వీటిల్లో మొత్తం 51,460 మంది మహిళా సభ్యులున్నారు. చేవెళ్ల మండలంలో 1,181 స్వయం సహాయక సంఘాలు, 58 గ్రామ సమాఖ్యలు, 12,614 మంది సభ్యులున్నారు. షాబాద్ మండలంలో 1,006 ఎస్‌హెచ్‌జీలు, 45 గ్రామ సమాఖ్యలు, 14,088 మంది సభ్యులు ఉన్నారు. శంకర్‌పల్లిలో 925 ఎస్‌హెచ్‌జీలు, 39 గ్రామ సమాఖ్యలు, 10,548 మంది సభ్యులు ఉన్నారు. మొయినాబాద్ మండలంలో 1,368 స్వయం సహాయక సంఘాలు, 51 గ్రామ సమాఖ్యలు, 14,210 మంది సభ్యులున్నారు. వీరందరికీ ఇప్పుడు సురక్ష బీమా వర్తించనుంది. డీఆర్డీఏ అధికారులు, సిబ్బంది బీమా పాలసీ విధి విధానాలు, ఇతర అంశాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

ప్రమాద బీమా

ప్రమాదవశాత్తు సభ్యురాలు చనిపోతే ఈ పథకం వర్తిస్తుంది. ప్రమాదవశాత్తు చనిపోయినట్టు నిర్ధారణైతే రూ.10లక్షల బీమా అందుతుంది. పోలీస్ ఎఫ్ఐఆర్ కాపీ, మెడికల్ ధ్రువీకరణ పత్రాలను గ్రామ సంఘం ట్యాబ్ ద్వారా గానీ, సెర్ప్, మెప్మా సిబ్బంది ద్వారా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తే సభ్యురాలి కుటుంబానికి రూ.10లక్షలు అందుతాయి. సభ్యురాలు అంగవైకల్యానికి గురైతే రూ.5లక్షల పరిహారం ఇస్తారు.

రుణ బీమా

స్వయం సహాయక సంఘంలోని సభ్యురాలు రుణం తీసుకుని ఏ కారణంతో మరణించినా గరిష్ఠంగా రూ.2లక్షల బీమా చెల్లిస్తారు. తీసుకున్న రుణం తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు.

స్త్రీ నిధి, సురక్ష బీమా పథకం

ఈ పథకం కాల పరిమితి మూడేళ్లు. సభ్యురాలికి ఇష్టముంటేనే ఇందులో చేరొచ్చు. ఏడాదికి రూ.230 చొప్పున మూడేళ్లకు రూ.690 ప్రీమియం చెల్లించాలి. ప్రీమియం చెల్లించేందుకు స్త్రీనిధి కింద ప్రత్యేక రుణం కూడా తీసుకోవచ్చు. ఈ రుణాన్ని వెలవారీ వాయిదాల్లో చెల్లిస్తే సరిపోతుంది. ఈ బీమా పథకంలో చేరిన సభ్యురాలు మరణిస్తే రూ.2లక్షల బీమా వస్తుంది.


పేద కుటుంబాలకు ప్రయోజనం

ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన బీమా పథకాలు పేద, మధ్య తరగతి మహిళలకు ప్రయోజనం చేకూరుస్తాయి. ప్రస్తుతం ప్రతీ ఒక్కరికి జీవిత బీమా తప్పనిసరి. ఇప్పటికే స్త్రీనిధి బీమా పథకం తక్కువ ప్రీమియంతో మూడేళ్లపాటు బీమా అవకాశం కల్పిస్తోంది. నూతనంగా మరో రెండు బీమా పథకాలు అందుబాటులోకి వచ్చాయి. వీటితో మహిళలకు సహజ, ప్రమాద మరణాలకు బీమా వర్తిస్తుంది.



\- శోభారాణి, ఏపీఎం, చేవెళ్ల









సీసీ రోడ్డు పనులు ప్రారంభం

పరిగి, జూలై 29: మునిసిపల్ పరిధిలోని 13,14 వార్డులకు కలిపే రోడ్డుకు సీసీ రోడ్డు పనులను అధికారులు సోమవారం ప్రారంభించారు. ఈ రోడ్డుతో రెండు కాలనీల వారికి సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా రాజకీయ పార్టీల నాయకులు కృష్ణ, మీరుతాహేర్‌అలీ, నసీమోద్దీన్, మాజీద్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.







టీటీడీ బోర్డు సభ్యుడిగా నందారం ప్రశాంత్?

కొడంగల్, జూలై 29: ప్రసిద్ధి గాంచిన తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యుడిగా కొడంగల్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌కు అవకాశం దక్కనుందనే ప్రచారం కొనసాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబానికి నమ్మకస్తుడిగా ప్రశాంత్ కొడంగల్‌లో అన్నీ తానై ఉంటూ గుర్తింపు పొందారు. నందారం కుటుంబీకులు తెలుగుదేశం పార్టీలో కొనసాగుతూ ఎమ్మెల్యేలుగా, టీటీడీ బోర్డు సభ్యులుగా పదవుల్లో కొనసాగారు. నందారం వెంకటయ్య, సూర్యనారాయణ అకాల మరణం అనంతరం నందారం ప్రశాంత్ తెరపైకి వచ్చారు. నాటి నుంచి నేటి వరకు నందారం కుటుంబీకులైన ప్రశాంత్ రేవంత్‌రెడ్డికి, సోదరుడు తిరుపతిరెడ్డికి నమ్మకస్తుడిగా కొనసాగుతున్నారు. టీడీపీ తరఫున పోటీ చేసి గెలుపొందిన నందారం కుటుంబీకులు నందారం వెంకటయ్య, సూర్య నారాయణ మృతి తర్వాత నాయకత్వ లోపం ఏర్పడింది. దీంతో టీడీపీ అధినేత, ప్రస్తుతం ఏపీ సీఎం చంద్రబాబునాయుడు 2009లో టీడీపీ అభ్యర్థిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించి కొడంగల్‌కు పంపించారు. కొంత కాలంలోనే నందారం కుటుంబీకుల ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డికి మద్దతు తెలిపి గెలిపించారు. దివంగత మాజీ ఎమ్మెల్యేలు నందారం వెంకటయ్య, సూర్యనారాయణ వారి కుటుంబం నుంచి అంచెలంచెలుగా రాజకీయాల్లో రాణిస్తూ నందారం ప్రశాంత్ గుర్తింపు పొందారు. గతంలో నందారం కుటుంబం నుంచి నందారం సూర్యనారాయణ టీటీడీ బోర్డు సభ్యుడిగా బాధ్యతలు చేపట్టారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి గెలుపునకు కృషి చేసిన మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డికి రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో నందారం కుటుంబానికి సముచిత స్థానం కల్పించాలనే ఉద్దేశంతో సీఎం రేవంత్‌రెడ్డి, సతీమణి గీతారెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి భావించడం ప్రశాంత్‌కు సముచిత స్థానం దక్కనుందనే ప్రచారం కొనసాగుతోంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల పూర్తితో టీటీడీ బోర్డు చైర్మన్ నియామకంలో బోర్డు సభ్యుడిగా అవకాశం దక్కనుందని సమాచారం. దీంతో పాటు టీటీడీకి అనుసంధానంగా కొడంగల్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి తోడ్పాటును అందించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ఏదిఏమైనా నందారం కుటుంబం నుంచి ప్రశాంత్‌కు సముచితస్థానం కల్పిస్తారనే పార్టీ వర్గాల్లో ప్రచారం కొనసాగుతోంది.


నందారం ప్రశాంత్

జేపీఎస్‌లు ఇక పంచాయతీ కార్యదర్శులు

- ఉత్తర్వులు జారీ చేసిన పంచాయతీ రాజ్ శాఖ
- గత ప్రభుత్వంలో పోరాటం
- జేపీఎస్‌ల సమస్యలు తీర్చిన రేవంత్ సర్కార్

తాండూరు, జూలై 29: పంచాయతీరాజ్ శాఖలో పనిచేసే జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్)లకు ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. జూనియన్ పంచాయతీ కార్యదర్శులుగా కొనసాగుతున్న అర్హత ఉన్న వారిని పంచాయతీ కార్యదర్శులుగా గుర్తిస్తూ పంచాయతీరాజ్ శాఖ ఉత్తర్వులను జారీ చేసింది. దీంతో జేపీఎస్‌లు ఇక పంచాయతీ కార్యదర్శులు స్కేలును పొందనున్నారు. వికారాబాద్ జిల్లాలో 20మంది, రంగారెడ్డి జిల్లాలో 40మంది అర్హత పొందారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో సర్వీసు రెగ్యులరైజేషన్, జేపీఎస్ నుంచి పంచాయతీ కార్యదర్శులుగా మార్చేందుకు 13రోజుల పాటు నిరసన దీక్షలను చేసి పోరాటం చేసిన విషయం తెలిసిందే. అధికారంలోకి వచ్చిన ఏడు నెలల్లోపే జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్ పరిష్కరించింది.

ప్రయోజనాలు

జూనియన్ పంచాయతీ కార్యదర్శులుగా కొనసాగే వారికి గౌరవ వేతనం రూ.15వేలు ఉండగా, వారికి ప్రమోషన్లు ఉండేవి కావు. ఉద్యోగ భద్రత ఉండేది కాదు. జేపీఎస్ నుంచి గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శిగా గుర్తింపు పొందడంతో 24,280-72,850 పేస్కేలు పొందడమే కాకుండా అదనపు అలవెన్సులను పొందుతారు. పంచాయతీరాజ్ చట్టం-2018ను అనుసరించి పంచాయతీ కార్యదర్శులుగా జిల్లా కలెక్టర్లు నియామక పత్రాలను అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. హోదా పెరగడంతో పాటు ఆర్థిక ప్రయోజనాలను పొందుతారు. దాదాపు రూ.12వేల జీతం పెరిగే అవకాశాలు ఉన్నాయి.









పాఠశాలలో వైభవంగా బోనాలు


బోనాలతో చిన్నారులు

తాండూరు, జూలై 29: ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని తాండూరులోని శివాజీచౌక్‌లో గల శ్రీసాయి మేధ విద్యాలయంలో బోనాల పండుగ ఉత్సవాలు వైభవంగా జరిగాయి. పాఠశాలలో ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారితో పాటు శివాజీ చౌక్‌లోని సారమ్మ మాతకు విద్యార్థులకు భక్తిశ్రద్ధలతో బోనమెత్తి నైవేద్యాలు సమర్పించారు. చక్కటి చదువుతో పాటు ఇంటిల్లిపాదిని చల్లంగా చూడు తల్లీ అంటూ మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలు, పోత రాజుల విన్యాసాలు, డప్పుల దరువులకు, డీజే పాటలకు విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీసాయి మేధ విద్యాలయ కరస్పాండెంట్ పెరుమాళ్ల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి సంప్రదాయంలో భాగంగా తెలంగాణలో వైభవంగా నిర్వహించే బోనాల గురించి క్లుప్తంగా విద్యార్థులకు తెలిపేందుకు పాఠశాలలో బోనాల పండుగను నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కమ్ముకున్న కారుమబ్బులు



తాండూరులో కమ్ముకున్న మేఘాలు

తాండూరు, జూలై 29: తాండూరును కారుమబ్బులు కమ్ముకున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షంతో ఇబ్బంది పడిన చిరు వ్యాపారులకు కాస్త ఊరట లభించింది. రోడ్లపై తోపుడుబండ్లపై యథావిధిగా వ్యాపారం చేసుకుంటున్నారు. రైతులు పొలాల్లో వ్యవసాయ పనులను వేగవంతం చేశారు. వరి నాట్లు, కలుపు మొక్కలు తీయించడం వంటి పనులను చేపట్టారు. రోజూ వారీ కూలీలకు మూడు రోజుల నుంచి కాస్త ఉపాధి లభించినట్లైంది. తాండూరు నియోజకవర్గంలో చెరువులు, కుంటలు, వాగులు నీటితో కళకళలాడుతున్నాయి. పలు కాలనీల్లో ముసురు వర్షానికి రోడ్లు చిత్తడిగా మారాయి. రోడ్లపై గుంతల్లో చేరిన వర్షపు నీటితో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు. తాండూరు పట్టణంలో పలు కాలనీల్లో అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు.

గురుకుల్ బుక్ అఫ్ ది ఇయర్ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న మహిపతి శ్రీనివాస్‌రావు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 29: మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీ అడ్మిషన్ డీన్ మహిపతి శ్రీనివాస్‌రావుకు గురుకుల్ బుక్ అఫ్ ది ఇయర్ అవార్డు లభించింది. శ్రీనివాస్‌రావు రాసిన 'స్పీక్ టూ రీచ్ పీక్స్' అనే పుస్తకం విద్యార్థులకు, ఉద్యోగులకు, పారిశ్రామికవేత్తలకు వారి వ్యక్తిగత, భావ వ్యక్తీకరణ నైపుణ్యతతో పాటు ఉపన్యాస కళలను పెంపొందించుకోవడానికి ఎంతగానో దోహదపడుతున్నందున గురుకుల్ బుక్ ఆఫ్ ది ఇయర్ అవార్డుకు ఎంపికయ్యాడు. ఈ మేరకు గురుకుల్ ప్లబిష్ ఫౌండర్ వినీత్ గూరా, బెంగళూరు జీరోడిఫెక్ట్ కన్సల్టెన్సీ సీఈవో డాక్టర్ ఎం జగదీష్‌ల చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ తాను రాసిన స్పీక్ టూ రీచ్ పీక్స్ బుక్ అమెజాన్ ద్వారా ఎంతోమంది విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, ఉద్యోగుల వ్యక్తిగత నైపుణ్యాలకు, వృత్తి నైపుణ్యాలకు దోహదపడిందన్నారు. ఈ పుస్తకానికి గతంలోనే అమెజాన్ బెస్ట్ సెల్లర్ అవార్డు ఇచ్చిందని గుర్తుచేశారు. దీంతో అనురాగ్ యూనివర్సిటీ సీఈవో నీలిమా, వైస్ చాన్సలర్, అధ్యాపకులు శ్రీనివాస్‌రావును అభినందించారు.

రూట్ నంబర్ 592లో ఆర్టీసీ బస్సులు

హైదరాబాద్ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ నుంచి శివారు ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు పెంచేదిశగా గ్రేటర్ ఆర్టీసీ చర్యలు చేపట్టింది. కొత్తగా 592 రూట్‌లో మెహిదీపట్నం నుంచి కందవాడ గ్రామానికి 3 బస్ ట్రిప్పులు నేటి(మంగళవారం) నుంచి నడుపుతున్నట్లు గ్రేటర్ ఆర్టీసీ ఈడీ వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెహిదీపట్నం నుంచి కందవాడ గ్రామానికిఉదయం 8 గంటలకు, మధ్యాహ్నం 1.30, 3.55 నిమిషాలకు, కందవాడ గ్రామం నుంచి మెహిదీపట్నంకు ఉదయం 9.25, మధ్యాహ్నం 2.45, సాయంత్రం 5.10 నిమిషాలకు బస్ ట్రిప్పులు అందుబాటులో ఉంటాయన్నారు. మెహిదీపట్నం డిపోకు చెందిన బస్సులు మెహిదీపట్నం నుంచి వయా నానల్ నగర్, లంగర్‌హౌస్, టీకేబ్రిడ్జి, బండ్లగూడ క్రాస్‌రోడ్, అరెమైసమ్మ, అప్పా, గోల్డెన్ ఫామ్స్, ఉస్మాన్‌సాగర్ క్రాస్ రోడ్స్, అజీజ్‌నగర్, హిమాయత్‌నగర్ క్రాస్‌రోడ్, మొయినాబాద్, కనకమామిడి ఎక్స్‌రోడ్, కేతిరెడ్డిపల్లి క్రాస్‌రోడ్, అప్పారెడ్డి గూడ క్రాస్‌రోడ్, టోల్‌కట్టా క్రాస్‌రోడ్, ముడిమల్ క్రాస్‌రోడ్, కందవాడ ఎక్స్‌రోడ్, మల్లాపూర్, కాసారం, కందవాడ, చేవెళ్ల వరకు బస్సులు నడుపుతామన్నారు.

అంబేడ్కర్ చూపిన మార్గం

అందరికీ అనుసరణీయం


అంబేడ్కర్ నాటక ప్రదర్శనలో పాల్గొన్న సంఘాల నాయకులు

ఆమనగల్లు, జూలై 29: అంబేడ్కర్ చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని లంబాడ హక్కుల పోరాట సమితి జాతీయ నాయకులు దాసురామ్ నాయక్, దళిత సంఘాల రాష్ట్ర నాయకులు శ్రీనివాస బహదూర్ అన్నారు. అసమానతలు పూర్తిగా తొలగిపోయి రాజ్యాంగ ఫలాలు పేదల దరిచేరినప్పుడే అంబేడ్కర్‌కు అసలైన నివాళి అని పేర్కొన్నారు. మండల కేంద్రంలోని దేవకి గార్డెన్‌లో ఆదివారం రాత్రి అంబేడ్కర్ నాటిక ప్రదర్శన నిర్వహించారు. అంబేడ్కర్ పూలే జాతర కమిటీ, డీబీఎస్‌యూ, రైతు సంఘం సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో దళిత ప్రజా సంఘాల నాయకులు, యువకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంబేడ్కర్ పూలే జాతర కమిటీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ జి.సుధాకర్, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు కానుగుల వెంకటయ్య, మాజీ ఎంపీపీ లక్ష్మీదేవి రఘురాములు పర్యవేక్షణలో నిర్వహించిన నాటికకు ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర నాయకులు దాసురామ్ నాయక్, దళిత సంఘాల రాష్ట్ర నాయకులు శ్రీనివాస బహదూర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంబేడ్కర్ పూలే జాతర కమిటీ జిల్లా అధ్యక్షుడు దరువుల శంకర్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ కన్వీనర్ జోగు రమేశ్, మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, నాయకులు మోహన్‌రెడ్డి, కానుగుల జంగయ్య, బాలయ్య, టైగర్ జంగయ్య, నర్సింహ, ఆశ్వ యాదయ్య, మల్లేశ్, వెంకటయ్య, నాయకులు పాల్గొన్నారు.

మిర్చి రైతు కన్నీరు


వర్షాలకు పాడైన మిర్చిపంట, బాధిత రైతు

పెద్దేముల్, జూలై 30: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం మిర్చిపంటకు నష్టాన్ని మిగిల్చింది. మండల కేంద్రానికి చెందిన మాలె సంతోష(బసమ్మ) వేసిన మిర్చి పంట వర్షాలకు మురిగిపోయాయి. మూడెకరాల్లో మిర్చిసాగు చేస్తే అరెకరం వరకు పంట మురిగిపోయి రూ.40వేల వరకు నష్టం వాటిల్లిందని వాపోయింది.

శస్త్ర చికిత్సలకు బ్రేక్

- సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ బదిలీతో కష్టాలు
- పరికరాలు అందుబాటులో ఉన్నా సర్జన్‌ల లోటు
- ఆపరేషన్ థియేటర్‌కు తాళం
- భర్తీ చేయకుంటే రోగులకు కష్టాలే


తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి

తాండూరు, జూలై 29: తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలకు బ్రేక్ పడింది. శస్త్ర చికిత్సలు చేసే వైద్యులు బదిలీల్లో వెళ్లిపోవడం, వచ్చే వారిలో శస్త్ర చికిత్సలు చేసే డాక్టర్లు లేకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలకు అవసరమయ్యే ఆపరేషన్ థియేటర్, స్కానర్ వంటి ఆపరేషన్లు చేసే వైద్యులు లేక శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. సర్జన్స్ లేని కారణంగా హైదరాబాద్ నగరం లేదా ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్లతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. తాండూరు జిల్లా ఆస్పత్రి పరిధిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం, జిల్లా ఆస్పత్రి నుంచి ఒకే సారి 11మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, డిప్యూటీ సివిల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. వారి స్థానంలో ఐదుగురు మాత్రమే ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. వచ్చిన వారంతా స్పెషలిస్టు వైద్యులు కావడంతో జనరల్ సర్జన్ లేక ఆపరేషన్లు చేయలేని పరిస్థితి ఏర్పడింది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి డిప్యూటీ సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా పనిచేస్తూ ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగిన డాక్టర్ మూర్తి ప్రతీ నెల 30 నుంచి 40 సర్జరీలు చేసేవారు. అయితే, ఆయన మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి ఏరియా ఆస్పత్రికి ఇటీవల బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జనరల్ సర్జన్ ఎవరూ లేని కారణంగా శస్త్ర చికిత్సలు జరుగడం లేదు. తాండూరు జిల్లా ఆస్పత్రికి ఇరత ప్రాంతాల నుంచి డెర్మాటాలజిస్ట్ డెంటల్, పెర్మటాలజిస్ట్ స్పెషాలిస్ట్ సర్జన్లు బదిలీపై వచ్చారు. వీరిలో ఎవరూ శస్త్ర చికిత్సలు చేసే వారు కాదని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నారు.

పెరుగుతున్న రోగుల తాకిడి


ఆపరేషన్ థియేటర్‌కు వేసిన తాళం

తాండూరు నియోజకవర్గ ప్రజలతో పాటు అటు కొడంగల్ ప్రాంత ప్రజలు, ఇటు కర్ణాటక ప్రాంత ప్రజలు నిత్యం వందలాది మంది రోగులు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం వస్తుంటారు. 200 పడకల ఆస్పత్రి కాగా, శస్త్ర చికిత్సకు కావల్సిన అన్ని రకాల పరికరాలు అందుబాటులోనే ఉన్నాయి. దీంతో రోగుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. హైడ్రోసెల్, హెర్నియా, అపెండెక్స్ వంటి శస్త్ర చికిత్సలు చేసేవారు. అయితే, ప్రస్తుతం ఈ ఆపరేషన్లకు అవసరమైన సర్జన్లు లేరు. ఆపరేషన్లు అవసరమైన పేదలను హైదరాబాద్, ప్రైవేటు ఆస్పత్రులకు పంపిస్తున్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

11మంది బదిలీ

తాండూరు ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఒకేసారి 11మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్లు, డిప్యూటీ సివిల్ అసిస్టెంట్లు బదిలీ అయ్యారు. బషీరాబాద్ పీహెచ్‌సీ కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)గా మారడంతో పాటు వైద్య విధాన పరిషత్‌లోకి మారింది. దీంతో స్థానికులైన, అనుభవం కలిగిన వైద్యులు బషీరాబాద్‌కు బదిలీ అయ్యారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో పని చేస్తున్న అనసిషియన్లు రవిశంకర్, శరత్, శ్రీధర్‌గౌడ్, ఫిజియన్ ప్రవీణ్‌గౌడ్‌లు బషీరాబాద్ పీహెచ్‌సీకి బదిలీ అయ్యారు. వీరందరూ డిప్యూటీ సివిల్ సర్జన్లు. బదిలీపై వెళ్లిన వారిని డిప్యూటేషన్‌పై రప్పించడం లేదా జనరల్ సర్జన్లను రప్పిస్తేనే జిల్లా ఆస్పత్రిలో పేదలకు కావాల్సిన వైద్యసేవలు అందే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తా



తాండూరు ఆస్పత్రి సిబ్బంది కొరత విషయమై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ నర్సింహ దృష్టికి తీసుకెళ్లాను. ఖాళీల భర్తీ, శస్త్ర చికిత్సలు చేసేందుకు అవసరమైన డాక్టర్లను నియమించేలా చూస్తా. రెండు జిల్లాల ప్రజలకు, కర్ణాటక ప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందించేందుకు ఈ ఆస్పత్రి ఎంతో ఉపయోగపడుతుంది. అంతరాయం ఏర్పడుతున్న వైద్య సేవలను మళ్లీ పునరుద్ధరించేలా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

- ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

మతతత్వ పార్టీలను సాగనంపుదాం


మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు సోమయ్య

నందిగామ, జూలై 29: మతతత్వ పార్టీలను సాగనంపాలని సీపీఎం రాష్ట్ర నాయకుడు సోమయ్య అన్నారు. సోమవారం నందిగామ మండల పరిధిలోని ఈదులపల్లి శివారులోని కాకా గెస్ట్‌హౌస్‌లో సీపీఎం రంగారెడ్డి జిల్లా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సోమయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ దేశంలో మతతత్వ శక్తులు రాజకీయ రంగంలోకి చొరబడి సమాజాన్ని అభివృద్ధి చెందనీయకుండా, కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్నాయని ఆరోపించారు. అభివృద్ధికి ఆటంకం కలిగించే రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చేప్పేవిధంగా సీపీఎం ఆధ్వర్యంలో కార్యక్రమాలు చేపట్టి, ఆ పార్టీల నిజస్వరూపాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు సామ్యేల్, భాస్కర్, రాజు, జగదీష్, యాదయ్య, శోభన్, కవిత, నర్సిరెడ్డి, అంజయ్య, శ్రీను నాయక్, ఈశ్వర్, కుర్మయ్య, వెంకటరమణ, లక్ష్మి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన హామీల అమలులో మోదీ విఫలం

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాలమల్లేశ్

శామీర్‌పేట: తెలంగాణ రాష్ట్ర విజభన హామీలను అమలు పర్చడంలో ప్రధాని నరేంద్రమోడీ ఘోరంగా విఫలమయ్యారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాలమల్లేశ్ ధ్వజమెత్తారు. శామీర్‌పేటలో సోమవారం సీపీఐ మండల కార్యదర్శి నరేంద్రప్రసాద్ అధ్యక్షతన ఉమ్మడి శామీర్‌పేట మండల సీపీఐ నిర్మాణకౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బాలమల్లేశ్ విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు పర్చడంలో పదేళ్లు గడిచినా ప్రధాని నరేంద్రమోడీ అమలు చేయకుండా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేటలో రైల్వేకోచ్ ఫ్యాక్టరీ, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీని ఇవ్వడంలో, నిధుల కేటాయింపులో ప్రధాని నరేంద్రమోడీ ఘోరంగా విఫలమయ్యారని విచారం వ్యక్తంచేశారు. ప్రభుత్వ సంస్థల ఆస్తుల పంపిణీలో రాష్ట్రానికి ఒక్క హామీని అమలు పర్చలేదని విమర్శించారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు దశరథ్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మల నర్సింహ, సీపీఐ సహాయ కార్యదర్శి చంద్రయ్య, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా నరేంద్రప్రసాద్

సీపీఐ శామీర్‌పేట మండల నూతన కార్యదర్శిగా శామీర్‌పేట గ్రామానికి చెందిన నరేంద్రప్రసాద్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎన్నుకున్నారు. శామీర్‌పేటలో ఉమ్మడి మండల సీపీఐ పార్టీ సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. సీపీఐ మండల సహాయకార్యదర్శులుగా అనిత, ఓంకార్, మురళీధర్‌రాజు, 13మందితో నూతన కార్యవర్గసభ్యులను ఎన్నుకున్నారు. అదేవిధంగా మూడుచింతలపల్లి మండల సీపీఐ నూతన కార్యదర్శిగా రాములుగౌడ్‌ను ఎన్నుకున్నారు. అదేవిధంగా 11మందిని మండల నూతన కమిటీ కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు.

ముగిసిన పౌరాణిక నాటక పోటీలు

విజేతలకు నగదు బహూకరణ


పౌరాణిక నాటక ప్రదర్శన

షాద్‌నగర్‌అర్బన్, జూలై 29 : తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, శ్రీవాణి సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన రెండు రోజుల రాష్ట్రస్థాయి పౌరాణిక నాటక పోటీలు ముగిశాయి. షాద్‌నగర్ గణేష్ గార్డెన్‌లో శనివారం ప్రారంభమైన నాటక పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో 24 కళాబృందాలు భక్త చింతామణి, శ్రీకృష్ణ రాయబారం, శ్రీకృష్ణాంజనేయ యుద్ధం, శ్రీరామాంజనేయ యుద్ధం, బాలనాగమ్మ, శ్రీసత్య హరిశ్చంద్ర, గయోపాఖ్యానం, రాజసూయ యాగం, శ్రీకృష్ణ తులాభారం తదితర నాటకాలను ప్రదర్శించారు. పోటీల్లో న్యాయనిర్ణేతలుగా సాల్వాచారి, భవానీజగదీశ్వర్‌రెడ్డి, రామాచారి, ద్రోణాచారి వ్యవహరించారు. పోటీల్లో మహమ్మదాబాద్ మండలం దేశాయపల్లికి చెందిన మైత్రి కళా పరిషత్‌కు మొదటి బహుమతి, పాలమూరుకు చెందిన స్వరకహరి కల్చరల్ అకాడమీకి రెండో బహుమతి, జడ్చర్ల మండలం గంగాపురానికి చెందిన శ్రీ నవజ్యోతి కళానాట్యమండలికి మూడో బహుమతి లభించాయి. ముగింపు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్యయాదవ్, మున్సిపల్ ఛైర్మన్ కె.నరేందర్, కరీంనగర్ మాజీ జడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు మహేందర్‌రెడ్డి, వీహెచ్‌పీ ప్రాంత కార్యవాహ బండారి రమేష్, పౌల్ట్రీ పారిశ్రామిక వేత్త పాతూరి వెంకటరావు, విద్యావేత్త ఎన్నే.రాజేంద్రప్రసాద్, శ్రీవాణి సంస్కృతిక సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మీనారాయణ, రాష్ట్ర కోశాధికారి ఎస్.గోపాల్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కె.శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇ.సురేష్, కోశాధికారి గడ్డం వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీసుల చొరవ.. గుంతలు పూడ్చివేత


ఫత్తేపురం బ్రిడ్జి వద్ద గుంతలను పూడ్చివేయిస్తున్న సీఐ వెంకటేశం

శంకర్‌పల్లి, జూలై 29: శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫత్తేపురం బ్రిడ్జి వద్ద ఏర్పడిన గుంతలను ట్రాఫిక్ పోలీసులు సోమవారం పూడ్చివేయించారు. వర్షాలకు రోడ్డులో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడగా.. వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దాంతో చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం స్థానికులతో మాట్లాడి మొరం(మట్టి) తెప్పించారు. జేసీబీ సహాయంతో గుంతలను చదును చేయించారు. ఫత్తేపురం-శంకర్‌పల్లి వద్ద గల తీగలవాగు, ఫత్తేపురం బ్రిడ్జి వద్ద ఏర్పడిన గోతులను పూడ్చించడం పట్ల స్థానికులతో పాటుగా వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు. రోడ్డు భవనాల శాఖ అధికారులు చేయాల్సిన పనిని ట్రాఫిక్ పోలీసులు చేయడంపై పలువురు ప్రశంసలు కురిపించారు. కాగా, శంకర్‌పల్లి చౌరస్తా నుంచి ఫత్తేపురం వరకు రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు కాగా, శంకుస్థాపన చేసి నాలుగు సంవత్సరాలు కావస్తోంది. నిత్యం వాహనదారులు నరకం అనుభవిస్తున్నా.. ఆర్‌అండ్‌బీ అధికారుల్లో ఉలుకూ.. పలుకూ లేకపోవడం పట్ల పలువురు మండిపడుతున్నారు. రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేస్తే ఈ తిప్పలు ఉండవు కదా.. అని స్థానికులు చర్చించుకున్నారు.

రాచకొండలో రహదారి భద్రతకు 'ఆప్ట్'

- రోడ్డు ప్రమాదాల విశ్లేషణ, నివారణే లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సీపీ



హైదరాబాద్ సిటీ, జూలై 29(ఆంధ్రజ్యోతి): ప్రతీయేటా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో వేలాదిమంది ప్రాణాలు కోల్పోతున్నారు. వేల మంది క్షతగాత్రులు వికలాంగులుగా మారి దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు. భద్రతకు పెద్ద పీట వేసి రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించాలని రాచకొండ సీపీ సుధీర్ బాబు సంకల్పించారు. అందుకోసం ఆప్ట్ (ఏఏపీటీ) అనే ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

ప్రమాదాలపై విశ్లేషణ..

కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను విశ్లేషించి, ప్రమాదం జరగడానికి గల కారణాలను తెలుసుకోవడానికి, మరోసారి అక్కడ ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవడానికి సీపీ ప్రత్యేకంగా యాక్సిడెంట్స్ ఎనాలసిస్, ప్రివెన్షన్ టీమ్ (ఆప్ట్) ను ఏర్పాటు చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ఈ బృందం ఘటనా స్థలానికి చేరుకుంటుంది. స్థానిక పోలీసుల సహకారం తో సంఘటనా స్థలంలోని ఆధారాలను సేకరిస్తుంది. అక్కడి సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి ప్రమాదం జరిగిన తీరు, యాక్సిడెంట్‌కు గల కారణాలు తెలుసుకుంటారు. గతంలో అక్కడ తరచూ యాక్సిడెంట్స్ జరిగితే ఆ ప్రాంతమైతే దాన్ని బ్లాక్‌స్పాట్‌గా గుర్తిస్తారు. ఒకవేళ రోడ్డు నిర్మాణలోపం, ఇంజనీరింగ్ తప్పిదాలు, యూటర్న్‌లు, కర్వ్ వంటి కారణాలతో యాక్సిడెంట్ జరిగితే ఆ విషయాన్ని ఆధారాలతో సహా.. విశ్లేషించి రిపోర్టు తయారు చేస్తారు. ఈ క్రమంలో జీహెచ్‌ఎంసీ, ఇంజనీరింగ్ విభాగం, నేషనల్ హైవే అథారిటీస్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ తదితర శాఖల అధికారులతో సీపీ సమీక్షా సమావేశం నిర్వహించి రోడ్డు ప్రమాదాలపై గుర్తించిన కారణాలను సంబంధిత శాఖల అధికారుల దృష్టి తీసుకెళ్తారు. ఆ శాఖల సమన్వయంతో లోపాలను సరిచేసి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నారు. ఆప్ట్ బృందం చేస్తున్న విశ్లేషణతో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడంతో పాటు.. రహదారి భద్రతకు సీపీ పెద్దపీట వేస్తున్నారు.

హిట్ అండ్ రన్ కేసుల్లో సహకారం..

ఆప్ట్‌తో రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడానికి ప్రయత్నించడంతో పాటు.. హిట్ అండ్ రన్ కేసులను సైతం ఛేదించేందుకు ప్రత్యేక బృందం కృషి చేస్తున్నట్లు తెలిసింది. ప్రమాదాలను విశ్లేషించే క్రమంలో అక్కడ ప్రమాదం హిట్ అండ్ రన్ అయితే సీసీ టీవీలను విశ్లేషిస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదం చేసి ఆపకుండా వెళ్లిపోయిన వాహనాన్ని సీసీటీవీ కెమెరాల ద్వారా సేకరించిన టెక్నికల్ ఎవిడెన్స్‌తో గుర్తిస్తున్నారు. ఆ ఆధారాలను లా అండ్ ఆర్డర్ పోలీసులకు ఇచ్చి హిట్ అండ్ రన్ ప్రమాదాలను ఛేదించడంలోనూ సహకారం అందిస్తున్నట్లు తెలిసింది. దాంతో ప్రమాదంలో మృతిచెందిన వారికి, క్షతగాత్రులకు సకాలంలో న్యాయం జరిగడంతో పాటు.. నిందితులకు శిక్షపడే అవకాశం ఉంది.

మరికొందరికి..

- స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి
- జిల్లాలో 70 మంది ఉపాధ్యాయులకు అవకాశం



వికారాబాద్, జూలై 29 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్వహించిన ఉపాధ్యాయ పదోన్నతుల్లో మిగిలిపోయిన ఖాళీల్లో మరికొందరికి అవకాశం కల్పించారు. జిల్లాలో గత నెలలో జరిగిన ఉపాధ్యాయ పదోన్నతుల్లో వివిధ కారణాలతో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పోస్టులను అర్హత కలిగిన సీనియర్ ఉపాధ్యాయులకు కేటాయించే విధంగా జిల్లా విద్యాశాఖ చర్యలు తీసుకుంది. జిల్లాలో పదోన్నతులతో భర్తీ చేయాల్సిన స్కూల్ అసిస్టెంట్, ఆ స్థాయి పోస్టులు 78 ఖాళీగా ఉండగా, తాజాగా నిర్వహించిన పదోన్నతుల్లో 70 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు లభించాయి. మ్యాథమెటిక్స్‌లో ఇద్దరికి, ఫిజికల్ సైన్స్‌లో ఆరుగురికి, ఇంగ్లీష్ పది, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం పద్నాలుగు, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఆరుగురికి, బయోలాజికల్ లో ఏడుగురికి, స్కూల్ అసిస్టెంట్ హిందీలో ఇద్దరికి, ఉర్దూలో ఒకరికి, తెలుగులో ఐదుగురికి, సోషల్ స్టడీస్‌లో పదిహేను మందికి, ఫిజికల్ డైరెక్టర్‌గా ఇద్దరికి పదోన్నతి లభించింది. ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు పది ఖాళీలు ఉండగా, కేవలం ఇద్దరు అభ్యర్థులు మాత్రమే అర్హులు ఉండడంతో ఆ ఇద్దరికే పదోన్నతి లభించింది. ఆదివారం వెబ్ ఆప్షన్లు క్లోజ్ కాగా, ఆప్షన్లు ఇచ్చిన ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ పాఠశాలలను కేటాయించారు. పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో మంగళవారం చేరాల్సి ఉంటుంది.

జిల్లాలో 733 మందికి పదోన్నతులు

గత నెలలో ప్రారంభమైన పదోన్నతుల ప్రక్రియ ఎట్టకేలకు ముగిసింది. గత నెలలో అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంటకు జీహెచ్‌ఎంలుగా, ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్లు, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు కల్పించిన విషయం తెలిసిందే. అప్‌గ్రేడేషన్ పొందిన భాషా పండితుల బదిలీలు నిర్వహించి పోస్టింగులు ఇచ్చారు. ప్రభుత్వం చేపట్టిన పదోన్నతుల్లో జిల్లాలో మొత్తం 733 మందికి పదోన్నతులు లభించాయి. జీహెచ్‌ఎం పోస్టుల పదోన్నతులు మల్టీ జోన్ -2 పరిధిలో జరగగా, స్కూల్ అసిస్టెంట్, ఆ సమాన స్థాయి పదోన్నతులు జిల్లా స్థాయిలో జరిగిన విషయం తెలిసిందే. గత నెలలో జరిగిన జీహెచ్‌ఎం పదోన్నతుల్లో జిల్లాలో ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 94 జీహెచ్‌ఎం పోస్టులను భర్తీ చేయగా, 639 స్కూల్ అసిస్టెంట్లు, ఆ సమాన స్థాయి పదోన్నతులు కల్పించారు. అర్హులైన ఎస్‌జీటీల్లో పీఎస్ హెచ్‌ఎంలుగా 72 మందికి పదోన్నతులు కల్పించగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో బయో సైన్స్‌లో 40 మందికి, ఇంగ్లీష్‌లో 39, మ్యాథమెటిక్స్‌లో 30, ఫిజికల్ సైన్స్‌లో 9, సోషల్ స్టడీస్‌లో 49, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో ఒకరికి పదోన్నతులు లభించాయి. భాషా పండితులు, పీఈటీ పోస్టుల అప్‌గ్రేడేషన్‌తో జిల్లాలో హిందీలో 142, తెలుగులో 148, ఉర్దూలో 2, ఫిజికల్ ఎడ్యుకేషన్‌లో 37 మంది స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు పొందారు. కాగా, తాజాగా సోమవారం జిల్లాలో మిగిలిపోయిన స్కూల్ అసిస్టెంట్, ఆ సమాన స్థాయి 70 పోస్టులను అర్హత కలిగిన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తూ విద్యా శాఖ ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి

మహేశ్వరం, జూలై 29: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్లార్) అన్నారు. సోమవారం మహేశ్వరంలోని వత్తుల రఘుపతి భవన్‌లో మండల కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని అన్ని గ్రామపంచాయితీల్లో కాంగ్రెస్ జెండా రెపరెపలాడాలన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ.. కాంగ్రెస్ సత్తా ఏమిటో నిరూపించుకునే అవకాశం కార్యకర్తలకు ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన మోసాలను ఎండగడుతూ కాంగ్రెస్ చేస్తున్న అభివృద్ధిని వివరించాలన్నారు. ముఖ్యంగా రేవంత్‌రెడ్డి మహేశ్వరంపై ప్రత్యేక దృష్టి పెట్టారని, త్వరలో మహేశ్వరం ఎవరూ ఊహించని రీతిలో అభివృద్ధి చెందుతుందన్నారు. కాగా, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ అనితారెడ్డికి మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడంతో నిరాశతో సమావేశం నుంచి బయటకువెళ్లారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల సమయంలోగా కేఎల్లార్ అందరినీ కలుపుకొని పోవాలని, లేనియెడల విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లక తప్పదని సమావేశంలో పాల్గొన్న పలువురు నాయకులు చర్చించుకున్నట్లు సమాచారం. వీలైనంత త్వరగా మహేశ్వం మండలంతో పాటు తుక్కుగూడ మున్సిపాలిటీ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎన్నిక ఉండడంతో.. అధ్యక్ష పదవి రేసులో మండలానికి చెందిన నాయకులు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, సురేందర్‌రెడ్డి, ఎ.ప్రశాంత్‌రెడ్డి, మురళీధర్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మంత్రి బాల్‌రాజ్, ప్రభునాయక్, అంజయ్య, నర్సింహ, యాదయ్య, రాజు, ప్రవీణ్, రవిందర్‌నాయక్‌లున్నారు. మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రేసులో అంగోత్ కృష్ణానాయక్, నేనావత్‌రాజు, పాండునాయక్, సేవ్యానాయక్, విఠల్‌నాయక్, గోపాల్, హరిసింగ్ తదితరులు పోటీలో ఉన్నారని, వీరందరి పేర్లను వారి వారి గ్రామాల కార్యకర్తలతో చర్చించి పదవులను కేటాయిస్తామని కేఎల్లార్ తెలిపారు.

బీఆర్ఎస్ అమలు చేసిన పథకాలను కొనసాగించాలి



సబితారెడ్డిని కలిసిన నర్సింహ, తదితరులు

కందుకూరు, జూలై 29: బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగించాలని, అందుకు శాసనసభలో ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సోమవారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కలిసి విన్నవించారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ ఆధ్వర్యంలో నగరంలోని సబితారెడ్డి నివాసానికి వెళ్లి ఆమెకు వినతిపత్రం అందజేశారు. నర్సింహ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో అమలు చేసిన దళిత బంధు పథకం కొనసాగించాలని, ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆ పథకాలను కొనసాగించడం లేదన్నారు. ఈ మేరకు పలు సమస్యలను సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి, గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అన్ని సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని నిరుపేదల కోసమేనని, ఈ ప్రభుత్వం ఎందుకు అమలు చేయడం లేదోననేజ, తాను శాసనసభలో ప్రశ్నిస్తానని తెలిపారు. ఆ సంఘం నేతలు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

- గ్రామ పంచాయతీ కార్మికులు
- భిక్షాటన చేసి నిరసన

యాచారం/మంచాల, జూలై 29 : పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, నెలకు రూ.26వేల వేతనమందించాలని, ఈఎస్ఐ సౌకర్యం, గత ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 51ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం వివిధ గ్రామాలకు చెందిన పంచాయతీ కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. దుకాణాలు, ఇళ్లిల్లు తిరిగి భిక్షాటన చేయడంతో స్థానికులు విస్తుపోయారు. కాగా, నేడు(మంగళవారం) చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్మికులు తెలిపారు. తమ చేత ప్రభుత్వం వెట్టిచాకిరీ చేయించుకుంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఉద్యోగభద్రత కల్పించాలని, తగిన న్యాయం చేసేదాకా పోరాటం చేస్తామని తెలిపారు, రాష్ట్ర ప్రభుత్వం నేడు ఇస్తున్న వేతనాన్ని ఇద్దరు కార్మికులు పంచుకుంటున్నామని వాపోయారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గ్యారపాండు, యాచారం మండల నాయకులు బోడ కృష్ణ, కొర్ర నరేందర్, శరణం తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లోయపల్లిలో గ్రామపంచాయతీ కార్మికులు సోమవారం భిక్షాటన చేసి ప్రభుత్వానికి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల జీతాలు నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సమస్యల పరిష్కానికై ఈ నెల 30 తలపెట్టిన చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



యాచారం : భిక్షాటన చేస్తున్న పంచాయతీ కార్మికులు



మంచాల : లోయపల్లిలో భిక్షాటన చేస్తున్న జీపీ కార్మికులు

క్రైం కార్నర్

కోర్టులో కేసు ఉండగా దాయాదుల గొడవ

- భూమి పంపకంలో తేడాల కారణంగా తరచూ కీచులాట
- పొలం దున్నుతుండగా అడ్డుకున్నారని పోలీసులకు బాధితుడి ఫిర్యాదు
- కేసు నమోదు చేసుకొని విచారిస్తున్న పోలీసులు

యాచారం, జూలై 29 : మండలంలోని కిషన్‌పల్లి భూ వివాదం మరోమారు తెరపైకి వచ్చింది. నల్లవెల్లి రెవెన్యూ పరిధిలోని కిషన్‌పల్లిలో సర్వేనెంబర్లు 736లో 2 ఎకరాల 12 గుంటలు, 738లో 4 ఎకరాల 6గుంటలు. 757లో 12ఎకరాల 6గుంటలు, 758లో 13ఎకరాల 10గుంటలు, 769లో 4ఎకరాల 35గుంటలభూమి ఉంది. 1999లో పాల శ్రీకాంత్, పాల రాజు(దాయాదులు) పంచుకున్నారు. పాల రాజు పొలంలో అధిక భాగం బండరాళ్లుండటంతో 18 ఎకరాల 22గుంటలు, శ్రీకాంత్ కుటుంబానికి 17ఎకరాల 12గుంటల భూమి వచ్చింది. రాజు పొలంలో బండరాళ్లుండడంతో ఎకరం 10 గుంటల భూమి ఎక్కువ పంపకం చేసుకున్నారు. కాగా, రాజు కుటుంబానికి ఎకరం 10గుంటల భూమి అధికంగా ఉన్నకారణంగా పొలాన్ని మరోమారు పంచుకోవాలని చాలా కాలంగా తగువు పడుతున్నారు. ఈ విషయమై వారు తరచూ గొడవ పడుతున్నారు. ఈక్రమంలో సోమవారం రాజు తనకు చెందిన భూమిని ట్రాక్టర్‌తో దున్నుతుండగా శ్రీకాంత్ కుటుంబీకులు అడ్డు తగిలి రాజుపై దాడిచేసి ఘర్షణకు దిగారు. పొలం దున్నకుండా అడ్డుపడ్డారు. దాంతో అతడు పోలీసులను ఆశ్రయించగా విచారణ చేశారు. శ్రీకాంత్ కుటుంబీకులపై కేసు నమోదైంది. శ్రీకాంత్, రాజు కుటుంబాలను విచారించడానికి యాచారం పోలీసులు స్టేషన్‌కు రావాలని సమాచారమందించారు. ఈమేరకు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు వారిని విచారించారు. అయితే, తమపై రౌడీషీట్ తెరుస్తామని సీఐ శంకర్‌కుమార్ బెదిరించారని.. రాజు కుటుంబానికి పోలీసులు అండగా నిలిచారని శ్రీకాంత్ కుటుంబీకులు ఆరోపించారు. తమకు న్యాయం చేయకుండా పోలీసులు వేధిస్తున్నారని మీడియాతో మాట్లాడుతూ ఆరోపించారు. పోలీసులు సివిల్ తగాదాల్లో తలదూర్చారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై యాచారం సీఐని వివరణ కోరగా శ్రీకాంత్‌పై రౌడీషీట్ తెరుస్తామని చెప్పిన మాట వాస్తవమని చెప్పారు. తాము సివిల్ తగాదాల్లో తలదూర్చలేదని, భూమి పంపకం విషయంలో శ్రీకాంత్ కుటుంబీకులపై ఇప్పటికే 5 కేసులున్నాయని, కోర్టులో కేసు నడుస్తోందని పేర్కొన్నారు. కావాలనే శ్రీకాంత్ కుటుంబీకులు గొడవకు దిగుతున్నారని ఆయన తెలిపారు. అయితే, శ్రీకాంత్ కుటుంబం దాడికి యత్నించడంతోనే డయల్ 100కు కాల్ చేసినట్లు రాజు, కుటుంబీకులు తెలిపారు. పోలీసులపై సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేయడం దారుణమని వారు అన్నారు. తమకు న్యాయపరంగా అన్ని హక్కులున్నాయని ఈ సందర్భంగా రాజు కుటుంబీకులు తెలిపారు.

కనుల పండువగా బోనాలు



చేవెళ్ల : రామన్నగూడ గ్రామంలో బోనాల ఊరేగింపు

కొత్తూర్/చేవెళ్ల, జూలై 29: మున్సిపాలిటీలోని తిమ్మాపూర్, కుమ్మరిగూడ, మండల పరిధిలోని ఎస్‌బీ పల్లి, తీగాపూర్, ఇన్ముల్‌నర్వ గ్రామాల్లో సోమవారం బోనాల పండుగను ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పోతురాజులు నృత్యాలు, శివసత్తుల పూనకాలతో మహిళలు బోనాలతో ఊరేగింపుగా మైసమ్మ, పోచమ్మ దేవాలయాలకు తరలివెళ్లి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమాల్లో మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎమ్మె శ్రీలతసత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ జోలీ రవీందర్, కౌన్సిలర్లు మాధవి గోపాల్‌గౌడ్, చింతకింది చంద్రకళ రాజేందర్‌గౌడ్, కోస్గి శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.దేవేందర్‌యాదవ్, కడెంపల్లి శ్రీనివాస్, బి. జగన్‌మోహన్‌రెడ్డి, మెండె కృష్ణ, శివచారి తదితరులు పాల్గొన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని రామన్నగూడ, ఇబ్రహీంపల్లి, కౌకుంట్ల తదితర గ్రామాల్లో ఆషాడ మాసం బోనాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజలందరూ ఉదయం నుంచి రాత్రి వరకు సందడి చేశారు. బోనాల సందర్భంగా పోతురాజుల విన్యాసం, శివసత్తుల పూనకాలతో ఊరేగింపు కొనసాగింది. మహిళలు బోనాలతో తరలివెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించారు. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తూర్ : కుమ్మరిగూడలో నిర్వహించిన బోనాల ఉత్సవంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు

గ్రామానికి రెవెన్యూ నక్ష చేయించండి

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు చింతకుంటపల్లి వాసుల వినతి



ఎమ్మెల్యే శంకర్‌కు వినతిపత్రం అందిస్తున్న చింతకుంటపల్లి గ్రామస్తులు

కేశంపేట, జూలై 29: మండల పరిధిలోని చింతకుంటపల్లి గ్రామానికి రెవెన్యూ నక్ష చేయించాలని సోమవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు షాద్‌నగర్ పట్టణంలో గ్రామస్తులు వినతిపత్రం అందించారు. కాంగ్రెస్ పార్టీ కేశంపేట మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, కేశంపేట మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి, అల్వాల మాజీ ఎంపీటీసీ సురేష్‌రెడ్డి నేతృత్వంలో చింతకుంటపల్లి గ్రామస్తులు ఎమ్మెల్యేను కలిశారు. గ్రామంలో దాదాపు 700 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయని, నక్ష లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కొందరు రైతులు రెవెన్యూ రికార్డుల కంటే ఎక్కువ భూమిని సాగు చేసుకుంటున్నారని వివరించారు. అంతేకాకుండా గ్రామంలో ధన బలం ఉన్నవారు ఇతరుల భూములను ఆక్రమించుకుంటున్నారని, గ్రామానికి నక్ష లేకపోవడంతో కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. గత ప్రభుత్వంలో కొందరు ఇదే అంశాన్ని రాజకీయం చేసి లబ్ధి పొందారని, అయితే.. వారు సర్వే చేయలేకపోయారని తెలిపారు. ఎమ్మెల్యే రెవెన్యూ మంత్రితో మాట్లాడి సమస్యను పరిష్కరించేందుకు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పెంటయ్య, అంజయ్య, పారేశా, మల్లేష్, శంకరయ్య, యాదయ్య, బాబర్, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి

సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ



మాట్లాడుతున్న శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి

ఆమనగల్లు, జూలై 29: సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో కల్వకుర్తి నియోజకవర్గానికి మహర్దశ కలగనుందని, ఆయన చొరవతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని డీసీసీ ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందన్నారు. ఆమనగల్లు పట్టణంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి రూ.220 కోట్లు మంజూరు చేయడం హర్షదాయకమన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రకటించిన విధంగా నియోజకవర్గంలో బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.180 కోట్లు, మాడ్గులలో అంతర్గత మురుగు కాల్వలు, పాఠశాలల అభివృద్ధికి రూ.15కోట్లు, ఆమనగల్లులో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు రూ.10 కోట్లు, నియోజకవర్గంలో 5 హైలెవల్ వంతెనల నిర్మాణానికి రూ.15 కోట్లు, తాండ్ర పాఠశాల భవన నిర్మాణానికి రూ.5 కోట్లు కేటాయించడం జరిగిందన్నారు. ఆమనగల్లు పట్టణంలో డిగ్రీ, జూనియర్, పాలిటెక్నిక్ కళాశాలల భవనాల నిర్మాణానికి అవసరమైన నిధులు ఇస్తానని సీఎం ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. అదేవిధంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని మారుమూల గిరిజన తండాలకు బీటీ రోడ్లు నిర్మించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఏళ్లకాలంగా ఎదురుచూస్తున్న హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా మార్చడానికి రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నట్లు చెప్పారు. దివంగత జైపాల్ రెడ్డి లేని లోటును రేవంత్‌రెడ్డి భర్తీ చేస్తుండడం అభినందనీయమని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, జిల్లా నాయకుడు వస్పుల శ్రీశైలం, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి ఫరీద్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు

శంషాబాద్, జూలై 29 : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ నుంచి రాళ్లగూడ వరకు రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర రహదారుల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నిధులు విడుదల చేశారని కౌన్సిలర్ సంజయ్‌యాదవ్ ఓ ప్రకటనలో తెలిపారు. శంషాబాద్ మండలంలో ఇటీవల జరిగిన ఓ సమావేశానికి మంత్రి వెంకట్‌రెడ్డి హాజరైన సమయంలో శంషాబాద్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో రోడ్లలో గోతులు పడి ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రం ఇచ్చినట్లు సంజయ్‌యాదవ్ తెలిపారు. ఈ మేరకు మంత్రి శంషాబాద్ బస్టాండ్ నుంచి రాళ్లగూడ రోడ్డు, రైల్వేగేటు నుంచి ధర్మగిరి వరకు తొండిపల్లి, గొల్లపల్లి వరకు రోడ్ల నిర్మాణం కోసం నిధులు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారన్నారు. మంత్రి కోమటిరెడ్డి, సీఎం రేవంత్‌రెడ్డిలకు సంజయ్‌యాదవ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు గడ్డం శేఖర్‌యాదవ్, పీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జే. నరేందర్‌లు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంఈవోకు వినతి



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

శంషాబాద్, జూలై 29 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల విద్యాధికారి కార్యాలయంలో మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం మండల అధ్యక్షుడు గణేశ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం సానుకూలంగా ఆలోచించాలని, సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేటు సంస్థకు అప్పగించేందుకు యత్నిస్తున్నట్లు ఆరోపించారు. అదే జరిగితే కార్మికులు రోడ్డున పడుతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ముగిసిన కంటి వైద్యశిబిరం



ఆపరేషన్లు చేయించుకున్న వారితో రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు, జూలై 29: ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో వెల్దండ మండల కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం సోమవారం ముగిసింది. చెన్నై శంకర నేత్రాలయం సహకారంతో ఈనెల 19 నుంచి శిబిరం నిర్వహిస్తున్నారు. 11 రోజుల పాటు నిర్వహించిన శిబిరం ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శిబిరంలో ఆమనగల్లు, కల్వకుర్తి, కడ్తాల్, వెల్దండ, మాడ్గుల, తలకొండపల్లి మండలాల కు చెందిన 2500 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కంటి శుక్లాలు ఉన్న 150 మందికి శస్త్ర చికిత్సలు చేయించినట్లు రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. దృష్టిలోపం ఉన్న 1600 మందికి ఉచితంగా అద్దాలు అందించినట్లు చెప్పారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పనే ఐక్యత ఫౌండేషన్ ధ్యేయమని అన్నారు. నియోజకవర్గంలోని అన్ని మారుమూల గ్రామాలకు ఫౌండేషన్ సేవలు విస్తరిస్తామని చెప్పారు. ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డి, డైరెక్టర్ కృష్ణారెడ్డి, సభ్యులు రచ్చ శ్రీరాములు, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కొండల్, రమేశ్, అభినవ్ రెడ్డి, నరేందర్‌గౌడ్, మల్లయ్య, యూసఫ్, కొండల్‌రెడ్డి, గణేశ్, హుస్సేన్, మల్లేశ్, శేఖర్, శ్రీపతి, లాలు, శ్రీను, మహేశ్, రాహుల్, బాస్కర్, కళ్యాణ్, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

- నేదునూరు మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి
- విద్యార్థుల సౌకర్యార్థం సొంత నిధులతో రోడ్డుకు మరమ్మతులు



మొరం పోయిస్తున్న మాజీ సర్పంచ్ రామకృష్ణారెడ్డి

కందుకూరు, జూలై 29: ప్రజాసమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని నేదునూరు మాజీ సర్పంచ్ కాసుల రామకృష్ణారెడ్డి తెలిపారు. గ్రామ పంచాయతీలోని ఆదర్శ, జడ్పీహెచ్ఎస్ వరకు ఉన్న మట్టి రోడ్డు వర్షాలకు గుంతలమయమైంది. దాంతో విద్యార్థులు దాదాపు 350 మీటర్ల వరకు బురదలో నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి నెలకొంది. దాంతో రామకృష్ణారెడ్డి చొరవ తీసుకొని సోమవారం సొంత డబ్బుతో మట్టి(మొరం) పోయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి గ్రామంలోని ఆదర్శ, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేశారని గుర్తుచేశారు. వర్షాలతో నేదునూరు-బాచుపల్లి రోడ్డు గుంతలమయమైందని, మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. నాయకులు పి.లక్ష్మణ్, నల్లి శ్రీధర్, పి.నగేష్, డి.చంద్రమౌళి, పి.జైపాల్‌రెడ్డి, ఇ.నర్సింహ, ఎస్.రాజు, వి.బాబు, తదితరులు పాల్గొన్నారు.

తపాలా శాఖ పథకాలపై అవగాహన



వీర్లపల్లిలో అవగాహన కల్పిస్తున్న పోస్టల్ అధికారి

నందిగామ, జూలై 29: మండల పరిధిలోని వీర్లపల్లి గ్రామపంచాయతీలో సోమవారం తపాలా శాఖ పథకాలపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. పోస్టాఫీస్ పరిధిలోని సుకన్య సమృద్ధియోజన, సేవింగ్ బ్యాంకింగ్, రికవరీ డిపాజిట్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ తదితర పథకాలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా 5 సంవత్సరాల లోపు పిల్లలకు ఉచితంగా ఆధార్ కార్డు జారీ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ సబ్‌డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, తపాలా శాఖ సిబ్బంది ప్రభు, భాస్కర్, సురేష్, ఆంజనేయులు, లక్ష్మణ్, సిద్ధార్థ, భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి నాయకుల ఆర్థిక సాయం




కేశంపేట : ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

కేశంపేట/తలకొండపల్లి/, జూలై 29: మండల పరిధిలోని లింగంధన గ్రామానికి చెందిన బంటు లక్ష్మయ్య సోమవారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబానికి అండగా నిలిచారు. ఇరు పార్టీల నేతలు పెద్దఎత్తున ఆర్థిక సాయం చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ జడ్పీటీసీ తాండ్ర విశాలశ్రవణ్‌రెడ్డి, రూ.5వేలు, గ్రామ మాజీ సర్పంచ్‌లు రాంరెడ్డి, రూ.5వేలు, ప్రతాప్ రూ.2వేలు, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రాజేందర్‌రెడ్డి రూ.5వేలు, బీఆర్ఎస్ నాయకుడు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణగౌడ్ రూ.5వేలు, కొత్తపేట ప్యాక్స్ డైరెక్టర్ మధుసూదన్‌గౌడ్ రూ.1000, గుబ్బ సుదర్శన్ గుప్తా రూ.2వేలు, పార్టీ యువనాయకుడు తిరుపతిరెడ్డి రూ.2వేలు అందించారు. భాస్కర్, శ్రీధర్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, నరేందర్, బలరాం, పురుషోత్తం, రాములు, చిన్న నర్సింహ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు. తలకొండపల్లి మండలం తుర్కలపల్లికి చెందిన శ్రీను అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం శ్రీను కుటుంబాన్ని మిషన్‌భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుటుంబానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5వేలు సమకూర్చగా స్థానిక నాయకులు అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు దారమోని గణేశ్, నాగరాజు, ఎల్లయ్య, శేఖర్‌గౌడ్, శ్రీను, బాబు, సురేశ్, సైదులు, పరుశరాములు, మల్లేశ్, తదితరులు పాల్గొన్నారు.

చదువుకు పేదరికం అడ్డుకాదు

కడ్తాల్ : చదువుకు పేదరికం అడ్డుకాదని యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన ఎండీ హైమాద్ జానీ కుమార్తె సనా.. హైదరాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ విద్యనభ్యసిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల మూలంగా ఉన్నత చదువుకు ఇబ్బంది పడుతున్న సనాకు రాఘవేందర్ ప్రోత్సాహకంగా రూ.5 వేల ఆర్థికసాయం చేశారు. నాయకులు కుమార్‌గౌడ్, రామచంద్రయ్య, దశరథ్ నాయక్, సాయి, మహేశ్, తదితరులున్నారు.

డ్రైనేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శాంతమ్మ

షాద్‌నగర్ అర్బన్, జూలై 29: షాద్‌నగర్ మున్సిపాలిటీలోని ఆర్టీసీ కాలనీలో నిర్మించతలపెట్టిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను కౌన్సిలర్ శాంతమ్మ సోమవారం ప్రారంభించారు. రూ.5లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో నిర్మాణ పనులు చేస్తున్నట్లు కౌన్సిలర్ తెలిపారు. 8వ వార్డులో చేస్తున్న అభివృద్ధి పనులకు ప్రతీ ఒక్కరు సహకరించాలని శాంతమ్మ కోరారు.

యువకుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



బాధితుడితో మాట్లాడుతున్న చెన్నయ్య

షాద్‌నగర్ రూరల్, జూలై 29 : ఫరూఖ్‌నగర్ మండలం కమ్మదనం గ్రామంలో శివకుమార్ అనే యువకుడిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య డిమాండ్ చేశారు. కమ్మదనం గ్రామంలో గత గురువారం బోనాల ఉత్సవాలు ముగిసిన తర్వాత యువకులు డ్యాన్సులు చేస్తుండగా.. కొందరు శివకుమార్‌పై దాడి చేసినట్లు తెలిపారు. అకారణంగా దాడికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు రమేష్, మహేష్, వినోద్, నర్సింహ, శేఖర్ తదితరులు ఉన్నారు.

ఆలూర్‌కు ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి

చేవెళ్ల, జూలై 29 : మండల పరిధిలోని ఆలూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలని ఆ గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, పలువురు గ్రామస్తులు సోమవారం నగరంలోని మెహిదీపట్నం డిపో మేనేజర్ మూర్తి కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిత్యం మెహిదీపట్నం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఆలూర్ గ్రామానికి గతంలో వచ్చిన తరహాలోనే నడిపించాలని వారు కోరారు. కాగా, ఆలూర్ గ్రామం నుంచి ఆర్టీసీకి మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు అనంతరాములుగౌడ్, విజయలక్ష్మి నర్సింలు, నాయకులు నర్సింహులు, శంకరయ్య, రాజు, నర్సింలు, హైమద్, ప్రశాంత్, రాజు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం



కడ్తాల్, జూలై 29: మండల పరిధిలోని కొండ్రిగాని బోడు తండా పంచాయతీ కార్యదర్శి లింగారెడ్డికి సోమవారం వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇటీవల లింగారెడ్డి బదిలీ అయ్యారు. ఐదేళ్లుగా కార్యదర్శిగా తండా అభివృద్ధికి సేవలందించి బదిలీ అయిన నేపథ్యంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్ ఆధ్వర్యంలో లింగారెడ్డిని పూలమాలలు, శాలువాలతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. మాజీ సర్పంచ్ సేవ్యబావోజీ, నాయకులు బిక్కునాయక్, రమేశ్, రంగ, మున్య, రంగనాథ్, వాల్య, రాజు, శోభారాణి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.